వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
సోమవారం, జులై 27, 2026



# మందులు, వ్యాక్సిన్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి

- హైదరాబాద్ డీఎంహెచ్ఓ డా.పుట్ల శ్రీనివాస్
- ఫార్మసీ అధికారులతో డీఎంఅండ్‌హెచ్‌వో ఉన్నత స్థాయి సమీక్ష
- కోల్డ్ చైన్ నిర్వహణ, ఎఫ్ఈఎఫ్‌వోపై స్పష్టమైన మార్గదర్శకాలు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హైదరాబాద్ జిల్లా పరిధిలోని ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల మందులు, వ్యాక్సిన్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ఫార్మసీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో జిల్లా పరిధిలోని యూపీహెచ్‌సీల ఫార్మసీ ఆఫీసర్లతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.

### మందుల కొరత ఉండకూడదు..

సమావేశానికి అధ్యక్షత వహించిన డా. పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి వైద్యుల ప్రిస్క్రిప్షన్ ప్రకారం అవసరమైన మందులు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందాలని ఆదేశించారు. ఫార్మసీ ఆఫీసర్లు పూర్తి సేవాభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ రోగులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. మందుల కొరత తలెత్తకుండా స్టాక్‌ను నిరంతరం పర్యవేక్షించాలని, సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి సకాలంలో తెప్పించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా అత్యవసర మందులు, ఎమర్జెన్సీ కిట్లు ప్రతి యూపీహెచ్‌సీలో తప్పనిసరిగా సిద్ధంగా ఉండాలన్నారు.

### వ్యాక్సిన్ల భద్రత, కోల్డ్ చైన్ పై ప్రత్యేక దృష్టి..

వ్యాక్సిన్ల భద్రతకు సంబంధించిన కోల్డ్ చైన్ వ్యవస్థ అత్యంత కీలకమని డా. శ్రీనివాస్ పేర్కొన్నారు. ఐఎల్ఆర్ (ILR), డీప్ ఫ్రీజర్ ఉష్ణోగ్రతలను ప్రతిరోజూ క్రమం తప్పకుండా పరిశీలించి రిజిస్టర్లలో నమోదు చేయాలని, వ్యాక్సిన్ల నాణ్యతలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకూడదని హెచ్చరించారు.

### సమీక్ష సమావేశంలోని ప్రధాన మార్గదర్శకాలు:

ఫార్మసీ స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వర్డ్–ఔట్‌వర్డ్ రికార్డులు, ఉష్ణోగ్రత రిజిస్టర్లను ప్రతిరోజూ అప్‌డేట్ చేయాలి. మందుల గడువును పరిశీలిస్తూ 'ఫస్ట్ ఎక్స్‌పైరీ ఫస్ట్ అవుట్' పద్ధతిని పాటించి, గడువు ముగియనున్న మందులను ముందుగా వినియోగించాలి. నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులు వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందుల పంపిణీలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవాలి. సమయపాలన పాటిస్తూ ప్రజలకు అత్యుత్తమ నాణ్యమైన ఔషధ సేవలు అందించడంలో ఫార్మసీ అధికారుల పాత్ర కీలకమని ఆయన కొనియాడారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డా.అనిత, డా.ఆశ్రితా రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, మాస్ మీడియా అధికారి జక్కుల రాములు, జిల్లా మలేరియా అధికారి ఆంజనేయులు, ఫార్మసీ స్టోర్ ఇంచార్జ్ సురేష్, ఉన్నతాధికారులు, జిల్లాలోని యూపీహెచ్‌సీల ఫార్మసీ ఆఫీసర్లు పాల్గొన్నారు.



# కోరుట్ల తెలంగాణ రక్షణ సేన ఇన్‌చార్జిగా డాక్టర్ రఘు



**కోరుట్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా డాక్టర్ రఘు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. ఇదివరకు కోరుట్లలో నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో డాక్టర్ రఘు తన అనుచరులతో కలిసి తెలంగాణ రక్షణ సేనలో చేరిన విషయం విదితమే. ఆ సందర్భంలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. డాక్టర్ రఘు పార్టీలో చేరికతో సంస్థకు అదనపు బలం చేకూరిందని, కోరుట్లలో పార్టీని మరింత బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో ఆయన్ను అసెంబ్లీకి పంపేందుకు ప్రతి కార్యకర్త శ్రమించాలని పిలుపునిచ్చారు.డాక్టర్ రఘు నియామకంతో నియోజకవర్గంలో పార్టీ నిర్మాణం పటిష్టమవుతుందని, ప్రజా సమస్యలపై పోరాటాలు మరియు సంస్థాగత విస్తరణ మరింత వేగవంతం అవుతుందని పార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ నియామకం పట్ల పార్టీ శ్రేణులు, డాక్టర్ రఘు అనుచరులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# చిలుక నర్సప్ప గురుస్వామికి 'శివ నంది ఈశ్వర కంకణ ధారణ' బిరుదు ప్రదానం




**కరీంనగర్, వాయిస్ ఆప్ వందే భారత్ :** నేడు తమిళనాడు రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీరంగపట్నంలో అఖిల భారత పద్మశాలి పద్మ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో 28వ మహాసభలు అత్యంత వైభవంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రాంతాల నుంచి పద్మ బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో హాజరై, సభలో పలు ఆధ్యాత్మిక అంశాలపై కూలంకషంగా చర్చలు జరిపారు. ఈ మహాసభల వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో, శ్రీ శివ భక్త మార్కండేయ మాలధారణ మార్గదర్శకులు, వ్యవస్థాపక సభ్యులు, 'పద్మ కుల రత్న' శ్రీ చిలుక నర్సప్ప గురుస్వామిని ఘనంగా సత్కరించారు. హిందూ ధర్మ పరిరక్షణకు, ఆధ్యాత్మిక సేవలందించడంలో ఆయన చేస్తున్న విశేష కృషిని గుర్తించి నిర్వాహకులు ఆయనకు 'శివ నంది ఈశ్వర కంకణ ధారణ' విశిష్ట బిరుదును బహూకరించి సన్మానించారు. ఈ సందర్భంగా చిలుక నర్సప్ప గురుస్వామి మాట్లాడుతూ.. తనకు ఈ సత్కారాన్ని అందించిన సంఘ నిర్వాహకులకు, పెద్దలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో హైందవ ధర్మ పరిరక్షణ కోసం, మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడానికి తన వంతు కృషి మరింత ఎక్కువగా కొనసాగిస్తానని ఉద్ఘాటించారు.

# ఘనంగా చేనేత సంఘాల అధ్యక్షులు, మహిళా సర్పంచులకు సన్మానం

**కమలాపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్లో పద్మశాలి పరపతి సంఘం ఆధ్వర్యంలో 16వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేదికగా నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, పద్మశాలీ మహిళా సర్పంచులను ఘనంగా సన్మానించారు. కమలాపూర్, మర్రిపెల్లిగూడెం, గోపాలపూర్ చేనేత సహకార సంఘాల నూతన అధ్యక్షులు, వారి కార్యవర్గ సభ్యులు, దేశరాజ్‌పల్లి సర్పంచ్ మిట్టపల్లి మహేశ్వరి, గూనిపర్తి సర్పంచ్ బుర్ర రాధిక, కమలాపూర్ 7వ వార్డు సభ్యురాలు తుమ్మ స్వాతిలను ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం నాయకులు, పరపతి సంఘం ప్రతినిధులు వారికి చేనేత కండువాలు కప్పి అభినందించారు. భవిష్యత్తులో రాజకీయ రంగంలో పద్మశాలీలు మరింతగా రాణించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

### పరపతి సంఘం నూతన అధ్యక్షుడిగా బొప్ప శివశంకర్..

కమలాపూర్ పద్మశాలి పరపతి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొప్ప శివశంకర్, ఉపాధ్యక్షులుగా మెండు రమేష్ లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యవర్గ సభ్యులకు పద్మశాలి కులస్తులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యం రాజగోపాల్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పులికంటి రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరపతి సంఘం అధ్యక్షులు పోరండ్ల కుమారస్వామి, బైరి సహదేవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేదాశి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు నల్ల సత్యనారాయణ, పరపతి సంఘం సభ్యులు, పెద్ద సంఖ్యలో పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

